జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

మంగళవారం | 21-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 651 పేజీలు: 4 వెల : రూ.7






# చికెన్ ధరల్లో.. సిండికేట్ మాయాజాలం!

* పత్రికల్లో ఒక ధర.. షాపుల్లో మరో ధర!
* సామాన్యుడి జేబుకు చికెన్ మాఫియా చిల్లు
* పర్యవేక్షణ కరువు.. పండగ చేసుకుంటున్న దళారులు
* కేజీకి రూ.50కి పైగా మిగులు..
* రిటైల్ షాపుల్లో కేజీకి 10 అదనపు వసూళ్లు
* స్కిన్‌తో కావాలంటే గ్యాస్ పేరుతో రూ.20 పైనే బాదుడు
* చక్రం తిప్పుతున్న ఆ నలుగురు?

**శ్రీకాకుళం, ఏప్రిల్ 19(వార్త):** జిల్లాలో చికెన్ ధరలు అదుపు తప్పాయి. వేసవి ఎండల కంటే మాంసం ధరల మంట సామాన్యుడిని ఎక్కువగా దహిస్తోంది. పౌల్ట్రీ రంగంపై పట్టున్న కొందరు బడా వ్యాపారులు 'సిండికేట్'గా ఏర్పడి, జిల్లాలో కృత్రిమ ధరల విలయాన్ని సృష్టిస్తున్నారు. పత్రికా ప్రకటనల ద్వారా ప్రజలకు ఒక ధర చూపిస్తూ, క్షేత్రస్థాయిలో మాత్రం పక్కా మాఫియా తరహాలో దోపిడీకి పాల్పడుతున్నారు. చికెన్ కి ఎక్కువ గిరాకీ ఉండే ప్రతీ ఆదివారం పత్రికల్లో ప్రచురితమైన ధరలను గమనిస్తే, వ్యాపారుల మాయాజాలం స్పష్టమవుతోంది. ఒక ప్రముఖ పత్రికలో స్కిన్‌లెస్ చికెన్ ధర కిలోకు రూ. 295 గా ఉంటే, అదే పత్రికకి పోటీ పత్రికగా భావించే మరో పత్రికలో వైజాగ్ జోన్ ధర రూ.248గా ఉంది. అంటే పత్రికా ప్రకటనల మధ్యే దాదాపు రూ.47 వ్యత్యాసం ఉంది. ఇక రిటైల్ షాపుల్లో పరిస్థితి మరీ ఘోరం. పత్రికల్లో గరిష్ట ధర రూ. 295 మించకూడదని ఉన్నా, శ్రీకాకుళం నగరం సహా జిల్లాలోని ప్రధాన కేంద్రాల్లో కిలో చికెన్ రూ. 320 నుండి రూ. 340 వరకు విక్రయిస్తున్నారు. అంటే ప్రతి కిలోపై లిలిరూ. 30 నుండి రూ. 50 వరకు అదనపు దోపిడీ జరుగుతోంది. అంటే ఒక్క రోజు 50 వేల కిలోలు జిల్లా వ్యాప్తంగా అమ్ముడుపోయాయని సాధారణంగా అనుకుంటే ఒకేరోజు పాతిక లక్షల రూపాయలు ఎవరు జేబులోకి వెళ్తున్నట్లు?

## సిండికేట్ పనితీరు ఇలా..

జిల్లాలోని చికెన్ అసోసియేషన్ సభ్యులు పేరుకే పత్రికల్లో ధరలను ప్రకటిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఉన్న రిటైల్ వ్యాపారులకు ఈ ధరలతో సంబంధం లేకుండా అమ్మాలని మౌఖిక ఆదేశాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. "డిమాండ్ ఎక్కువగా ఉంది.. కోళ్లు చనిపోతున్నాయి.. స్కిన్ తో అమ్మాలంటే గ్యాస్ అందుబాటులో ఉండటం లేదు" అనే సాకుతో కృత్రిమ కొరతను సృష్టించి, జిల్లావ్యాప్తంగా ఒకే రకమైన 'అధిక ధర' అమలయ్యేలా ఈ మాఫియా చక్రం తిప్పుతోంది. సామాన్య వినియోగదారుడు పత్రికలో చూసిన రేటు అడిగితే, "అవి పేపర్లో రేట్లు.. ఇక్కడ గిట్టుబాటు కాదు" అంటూ దురుసుగా సమాధానం ఇస్తున్న పరిస్థితి నెలకొంది.




## అధికార యంత్రాంగం ఏది?

ప్రతి ఆదివారం జిల్లావ్యాప్తంగా టన్నుల కొద్దీ చికెన్ విక్రయాలు జరుగుతాయి. కిలోపై రూ. 50 అదనంగా వసూలు చేయడం ద్వారా కోట్ల రూపాయల సొమ్ము ప్రజల జేబుల నుండి ఈ మాఫియా ఖాతాల్లోకి చేరుతోంది. ధరల నియంత్రణ బాధ్యత కలిగిన పౌరసరఫరాల శాఖ గానీ, తూనికలు కొలతల శాఖ అధికారులు గానీ కనీసం దుకాణాల వద్ద తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ప్రతి షాపు ముందు ఆ రోజు ధరల పట్టిక ప్రదర్శించాలనే నిబంధనను ఈ సిండికేట్ సభ్యులు తుంగలో తొక్కుతున్నారు. ప్రధాన రెండు దిన పత్రికల్లో వచ్చే ధరలకు, అమ్మే ధరలకు మధ్య ఉన్న అంతరాన్ని జిల్లా కలెక్టర్ సమీక్షించి, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలతో తనిఖీలు చేయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని దగా చేస్తున్న చికెన్ సిండికేట్ గుట్టును రట్టు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(జిల్లాలో బ్రాయిలర్ అసోసియేషన్ ఏం చేస్తుంది. అందులో ఎవరెవరు కీలక సభ్యులుగా ఉన్నారు. వారు సిండికేట్ ను ఎలా ప్రభావితం చేస్తారు. ధరల్లో ఎందుకు వ్యత్యాసాలు వస్తున్నాయి. ఎవరెవరి జేబుల్లోకి ఎంత వెళ్తున్నాయి. తదితర అంశాలతో మరో సంచికలో కలుద్దాం)



# చంద్రబాబు బర్త్‌డేకు.. కొత్తూరులో సైలెంట్ షాక్..!

* చంద్రబాబు బర్త్‌డేకు కేక్ లేదు... కేడర్ లేరు? * అగ్రనేత పుట్టినరోజే మర్చిపోయారా? * బ్యానర్లు లేవు... వేడుకలు లేవు... కొత్తూరులో టీడీపీకి ఏమైంది? * అధికారంలో ఉన్నా ఉత్సాహం ఎక్కడ..?

**కొత్తూరు, ఏప్రిల్ 20 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్రమశిక్షణ, కేడర్ ఉత్సాహానికి ప్రతీకగా చెప్పుకునే తెలుగుదేశం పార్టీలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగితే, శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు మండలంలో మాత్రం పూర్తిగా నిశ్శబ్దం నెలకొనడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. సాధారణంగా చంద్రబాబు పుట్టినరోజు అంటే కొత్తూరు మండలంలో పండుగ వాతావరణం కనిపిస్తుంది. గ్రామాలన్నీ బ్యానర్లు, ఫ్లెక్సీలతో నిండిపోతాయి. కేక్ కటింగ్‌లు, సేవా కార్యక్రమాలు, ఆసుపత్రుల్లో రోగులకు పండ్ల పంపిణీ వంటి కార్యక్రమాలతో కేడర్ ఉత్సాహం ఉరకలేస్తుంది. కానీ ఈసారి ఆ దృశ్యం పూర్తిగా మారిపోయింది. మండలంలోని కీలక ప్రాంతాల్లో ఒక్కచోట కూడా వేడుకల జాడ కనిపించలేదు. కనీసం కేక్ కట్ చేసిన ఘటన కూడా లేకపోవడం గమనార్హం. "ఇది నిజంగా చంద్రబాబు పుట్టినరోజేనా?" అన్న సందేహం కలిగేలా పరిస్థితి మారింది. ఈ నిశ్శబ్దం వెనుక అసలు కారణం ఏమిటన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, పాతపట్నం నియోజకవర్గంలో ముదురుతున్న వర్గపోరు, కూటమి నేతల మధ్య సమన్వయం లోపం ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. స్థానిక నాయకత్వంపై పెరుగుతున్న అసంతృప్తి, నేతల మధ్య విభేదాలు కేడర్‌ను అయోమయంలోకి నెట్టాయని చెబుతున్నారు. అధికారంలో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఏకతా లేకపోవడం వల్ల కార్యకర్తలు ఉత్సాహం కోల్పోయినట్లు స్పష్టమవుతోంది. పార్టీ అంతర్గతంగానూ ఈ పరిణామంపై చర్చలు జరుగుతున్నాయి. అగ్రనేత పుట్టినరోజునే పూర్తిగా విస్మరించడం సాధారణ విషయం కాదని, ఇది నాయకత్వ లోపానికి, గ్రూపు రాజకీయాల ప్రభావానికి నిదర్శనమని కొందరు నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. సాధారణంగా టీడీపీ కేడర్‌కు ఉన్న క్రమశిక్షణను దృష్టిలో ఉంచుకుంటే, ఈ స్థాయి నిర్లక్ష్యం వెనుక లోతైన అసంతృప్తి ఉందని అర్థమవుతోంది. కొత్తూరు మండలంలో కనిపించిన ఈ 'నిశ్శబ్దం' కేవలం యాదృచ్ఛికం కాదని, పాతపట్నం టీడీపీలో ముదురుతున్న అంతర్గత సంక్షోభానికి ఇది స్పష్టమైన సంకేతమని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పుడు అందరి దృష్టి పార్టీ అధిష్టానంపైనే ఉంది. ఈ పరిణామంపై నారా చంద్రబాబు నాయుడు ఎలా స్పందిస్తారు, స్థానిక స్థాయిలో మార్పులు చేస్తారా లేదా అన్నది రాబోయే రోజుల్లో స్పష్టత వచ్చే అంశంగా మారింది.



# హ్యాపీ బర్త్ డే.. సీఎం సార్

* జిల్లావ్యాప్తంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు * పండగల నిర్వహించిన తెలుగు తమ్ముళ్లు * పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు * ఆసుపత్రిలో రోగులు పండ్లు పంపిణీ * వైద్య, రక్తదాన శిబిరాలు, అన్నా క్యాంటీన్‌లో అన్నదానం

**శ్రీకాకుళం, ఏప్రిల్ 20 (వార్త):** టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు జన్మ దిన వేడుకలను సోమవారం శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిం చారు. పార్టీ కార్యాల యాల్లో టీడీపీ నాయకులు, కార్య కర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసు కున్నారు. చంద్ర బాబు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండా లని కోరుతూ ఆల యాల్లో పూజలు చేశారు. ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నియోజక వర్గ కేంద్రాల్లో వైద్య శిబిరాలు, రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేశారు. అన్నా క్యాంటీన్లలో పేదలకు అన్న దానం చేశారు. శ్రీకాకుళంలో ఎమ్మెల్యే గొండు శంకర్, ఆమదాల వలసలో కూన రవి కుమార్, నరస న్నపేటలో బగ్గు రమణ మూర్తి, పలాస లో గౌతు శిరీష, ఇచ్ఛాపురంలో బెందాళం అశోక్, పాతపట్నంలో మామిడి గోవిందరావు.. ఇలా అన్ని నియోజక కేంద్రాల్లో చంద్రబాబు జన్మదిన వేడుకలు పండగలా నిర్వహించారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## బలపంపై సింహాద్రి అప్పన్న నిజ రూపం

**- సూక్ష్మ కళాకారుడి ప్రతిభకు ప్రశంసలు**

**నరసన్నపేట, ఏప్రిల్ 20(వార్త):** సింహాద్రి వరాహ నరసింహస్వామి వారి నిజరూప దర్శనాన్ని బలపంపై సూక్ష్మంగా చిత్రించి ఓ కళాకారుడు తన ప్రతిభను చాటుకున్నారు. నరసన్నపేట మండలంలోని సంతతోటకు చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు వివిఎస్ఎన్ ఆచారి చందనోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కళాఖండాన్ని రూపొందించారు. ఆదివారం రాత్రి మూడు గంటలపాటు కష్టపడి బలపంపై అద్భుతమైన చిత్రాన్ని రూపొందించారు. కేవలం 6 మిల్లీమీటర్లు, 3 మిల్లీమీటర్ల పరిమాణంలో ఈ సూక్ష్మ చిత్రాన్ని ఆవిష్కరించడం విశేషంగా నిలిచింది. ఇలాంటి సూక్ష్మ కళాఖండాలను గతంలో కూడా రూపొందించానని ఆచారి తెలిపారు. ఆయన ప్రతిభకు స్థానికులు ప్రశంసలు కురిపించారు.





## మందసలో చంద్రబాబు జన్మదిన వేడుకలు

**-వాసుదేవ ఆలయంలో ప్రత్యేక పూజలు**

**- రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ**



**మందస, ఏప్రిల్ 20(వార్త):** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు మందసలో ఘనంగా జరిగాయి. మండల కూటమి నాయకులు మందసలోని శ్రీవాసుదేవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చనలు జరిపారు. ఆలయం చుట్టూ నాయకులు ప్రదక్షణలు నిర్వహించారు. అనంతరం మందస ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, కార్యదర్శి సాలీన మాధవరావు, దాసరి తాతారావు, బమ్మిడి కర్రయ్య, తమిరియా భాస్కరరావు, దుంకురు తిరుపతి, ముంజేటి చంద్రశేఖర్, రాజాన మహేశ్, కుప్పిలి వెంకట రావు, మెట్ట మహేష్, ఔగాన ఈశ్వర రావు, గుంట నారాయణ, చింతాడ లక్ష్మీనారాయణ, గార కృష్ణారావు, బర్ల హరికృష్ణ, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థి ప్రతిభ.. వంశీకి సన్మానం



**మందస, ఏప్రిల్ 20(వార్త):** ఇంటర్ మీడియట్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థి సకలాబత్తుల వంశీని స్వామి వివేకానంద సేవా సమితి ప్రతినిధులు సన్మానించారు. శరీరానికే అంగవైకల్యం తప్ప, బుద్ధి, జ్ఞానానికి కాదని వంశీ నిరూపించారు. కృషి, పట్టుదల, అంకితభావంతో చదివిన పలాస- కాశీబుగ్గ పట్నానికి చెందిన వంశీ ఇంటర్ మీడియట్ పరీక్షా ఫలితాల్లో 1000మార్కులకు 972 సాధించి, తానంటే ఏమిటో నిరూపించాడు. వంశీ పట్టుదల విద్యార్థులకు ఆదర్శణీయమన్నారు.

## బహడపల్లిలో బడి పిలుస్తోంది




**మందస, ఏప్రిల్ 20(వార్త):** బడి పిలుస్తోంది కార్యక్రమం బహడపల్లిలో సోమవారం జరిగింది. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన బహడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డోల కేశవరావు, ఎస్ఎంసి చైర్మన్ కరగాన వల్లభ రావు ఆధ్వర్యంలో వీధుల్లో ప్రభుత్వ విద్య ఆవశ్యకతను చెబుతూ ర్యాలీ నిర్వహించారు. సమీప గ్రామాల్లో కూడా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు డోల కేశవరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలతో కలిగే లాభాలు, సౌకర్యాలు వివరించారు. బహడపల్లి పాఠశాల సాధించిన విజయాలను గురించి ప్రజలకు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, తల్లిదండ్రులను ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్ఎంసి సభ్యులు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

## ఘోరంగా వంశధార కాలువ దుస్థితి

**- ఖరీఫ్ ముందు శుభ్రత, మరమ్మతులపై రైతుల ఆందోళన**



**నరసన్నపేట, ఏప్రిల్ 20(వార్త):** బొరిగివలస వద్ద ఉన్న ప్రధాన వంశధార కాలువ దుస్థితి అగమ్యగోచరంగా కనిపిస్తోంది. ఖరీఫ్ సీజన్ మరో రెండు నెలల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో కాలువ పరిస్థితిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో గుర్రపు డెక్క (మురుగు, మట్టి పేరుకుపోవడం) అధికంగా ఉండటంతో నీటి ప్రవాహం సక్రమంగా సాగడం లేదని తెలిపారు. కనీసం శుభ్రపరిచే పనులు కూడా చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నదని రైతులు ఆరోపిస్తున్నారు. అలాగే నీటి ప్రవాహాన్ని నియంత్రించే షట్టర్లు లేకపోవడంతో వచ్చిన సాగునీరు దిగువ ప్రాంతాలకు వెళ్లిపోతుందని, పైభాగం రైతులకు నీటి లాభం అందడం లేదని పేర్కొన్నారు. ఖరీఫ్ పంటల సాగు దృష్ట్యా వెంటనే కాలువను శుభ్రపరిచి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను రైతులు కోరుతున్నారు.

## శక్తి యాప్‌పై అవగాహన

**జలుమూరు, ఏప్రిల్ 20(వార్త):** జోనంకి గ్రామ ప్రభుత్వ ఎంపీపీ పాఠశాలలో సోమవారం శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి డివిజన్ శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్ మాట్లాడుతూ బాలబాలికలకు స్వీయ రక్షణ ఎంతో అవసరమని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ హెల్ప్‌లైన్ నెంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే నేషనల్ హైవే, గ్రామీణ రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీస్ కానిస్టేబుల్ చామంతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.




# జీడి బస్తాకు రూ.16వేల మద్దతు ధర ఇవ్వాలి

**-రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి**

**-ఎండోమెంట్ భూముల కౌలుదారులకు న్యాయం చేయాలి**

**-ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, గిరిజన సంఘం నాయకుల డిమాండ్**



**మందస, ఏప్రిల్ 20(వార్త):** జీడి బస్తా(80 కిలోల)కు రూ.16వేలు మద్దతు ధర ఇవ్వాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, గిరిజన సంఘం నాయకుల డిమాండ్ చేశారు. మందస తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం వారు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రాలను అధికారులకు అందజేశారు. మండల కార్యదర్శి పి.దేవేంద్ర, గిరిజన సంఘం నాయకులు సవర పాల్గొనరావు, గున్న బాబురావు, సేనాపతి సోమేశ్వరరావు మాట్లాడుతూ మందస మండల ఉద్దాన తీర ప్రాంతంలోనూ గిరిజన ప్రాంతాలలో జీడి పంట పండిస్తున్నారని, జీడి పంటకు ప్రభుత్వ మద్దతు ధర ప్రకటించకపోవడం వల్ల రైతులు దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి మద్దతు ధర ప్రకటించి, కొనుగోలు చేస్తామని. జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. నేటి వరకు అమలు జరగలేదన్నారు. జీడి పండించిన పేద రైతులు, గిరిజన రైతులు పంటలకు ధర లేక తీవ్ర నష్టం పోతున్నారని పేర్కొన్నారు. అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించినట్టుగానే జీడిపంటకు కూడా ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

### ఎండోమెంట్ భూముల రైతులకు న్యాయం చేయాలి

ఎండోమెంట్ భూములు సాగు చేస్తున్న రైతులకు అధికారులు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు. బాధిత రైతుల ఆధ్వర్యంలో ధర్నా చేసి వినతిపత్రం అందజేశారు. తరతరాలుగా రైతులు సాగులో ఉన్న భూములపై మందస వాసుదేవపెరుమాల్ ట్రస్ట్ పేరుతో నోటీసులు పంపించడం అన్యాయమన్నారు. మందస మండలంలో బాలిగాం, పిడి మందస, మందస పొందర వీధి రైతులకు మందస వాసుదేవ పెరుమాళ్ ట్రస్ట్ పేరుతో కోర్టు నోటీసులు పంపడం న్యాయం కాదన్నారు. తరతరాలుగా సాగులో ఉన్న పేద రైతుల ఎండోమెంట్ భూములను రైతులకు సమాచారం ఇవ్వకుండా ట్రస్టులకు బదిలీ చేయడం అన్యాయమని అన్నారు. పిడిమందస, బాలిగాం రైతుల భూములు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని, ఆ భూములకు అడంగల్ వన్ బిలో రైతులు పేరు మీద ఉన్నాయన్నారు. అయినా ట్రస్ట్ కోర్టు ద్వారా నోటీసులు పంపి రైతులకు మనోవేదనను గురి చేస్తున్నారన్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గున్న మాలయ్య, వడ్డి గోపాలకృష్ణ, కె.కేశవరావు, మట్ట ధర్మారావు, ఏకాశి తదితరులు పాల్గొన్నారు.

## సొండిపూడి అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలి



**మందస, ఏప్రిల్ 20(వార్త):** సొండిపూడి అభివృద్ధి ప్రజలంతా సహకరించాలని ప్రత్యేకాధికారి, మందస మండల పశు వైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. సొండిపూడి పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. సొండిపూడి పంచాయతీకి స్పెషల్ ఆఫీసర్ నియామకం జరిగిన వెంటనే గ్రామ సభ నిర్వహించడం జరిగింది. పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. స్పెషల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జరిగే గ్రామ సభకు సంబంధించి కొన్ని ముఖ్యమైన అంశాలను సమావేశంలో చర్చించారు. విధుల బాధ్యతను స్పెషల్ ఆఫీసర్ స్వీకరించిన అనంతరం గ్రామ అభివృద్ధి పనులు, పరిపాలన సక్రమంగా సాగేలా చూడటానికి గ్రామ సభ నిర్వహించడం జరిగిందని శ్రీకాంత్ చెప్పారు. ఈ సభలో సాధారణంగా ఉపాధి హామీ పనులు, తాగునీరు, పారిశుద్ధ్యం ,పెండింగ్‌లో ఉన్న గ్రామ అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సభను ఏర్పాటు బాధ్యత వహించారు. గ్రామంలోని ఓటర్లందరూ ఈ సభలో పాల్గొని తమ సమస్యలను స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు ఔగాన ఈశ్వరరావు, యానాది వాసు, అల్లుమల నారాయణరావు, చింతాడ లక్ష్మీనారాయణ, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక గ్రామం బ్రాహ్మణతర్ల!

**- ఆరు నూరైనా విగ్రహాన్ని కట్టి తీరుతాం**

**- గ్రామ పెద్దలు శపథం**



**పలాస, ఏప్రిల్ 20 (వార్త):** బ్రాహ్మణతర్ల గ్రామములో ఆరు నూరైనా హనుమాన్ విగ్రహాన్ని నిర్మిస్తామని, గ్రామ సాక్షిగా చెపుతున్న మాట ఇదేనని వైసీపీ నాయకులు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరమణ (చిట్టి) శబదం చేశారు. సోమవారం బ్రాహ్మణతర్ల బస్టాండ్ లో ఉన్న ఆటో స్టాండ్ లో హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేసే స్థలంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక గ్రామమైన బ్రాహ్మణతార్లల గ్రామమైన ఎంతగానో గ్రామాన్ని రాజకీయ రంగులు పులిమి హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. హనుమాన్ విగ్రహంపై రాజకీయ రగడ..! చేయడం సరికాదని, బ్రాహ్మణతర్లలో హనుమాన్ విగ్రహ నిర్మాణం చుట్టూ రగడ చల్లరేగుతుందని చెప్పారు. గ్రామాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆటో స్టాండ్ ప్రాంతంలో హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. దీనిలో భాగంగా శంకుస్థాపన కూడా నిర్వహించారు. అయితే, ఆ స్థలాన్ని కూటమి కి చెందిన కొందరు వ్యక్తులు పూడ్చివేయడం ఉద్రిక్తతకు దారితీసింది. ఇలాంటి చర్యలు సరికావని, ఎట్టి పరిస్థితుల్లోనూ హనుమాన్ విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

ఇదే సమయంలో, ఈ వివాదంపై స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారగా, ఈ వ్యవహారం రాజకీయ రంగు దాల్చింది. కూటమి నాయకులు పోగ్బలంతోనే అడ్డుకుంటున్నారని, గ్రామానికి ఆధ్యాత్మిక పేరు తీసుకురావడానికి ప్రయత్నిస్తుంటే అడ్డుకోవడం సరికాదని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మహిళలు మీపై అభిమానం చూపించాలంటే హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో ఈ ప్రాంతంలో ట్రాన్సఫర్ ఉన్నప్పుడు దానిని తీసేందుకు గ్రామస్తుల సహకారంతో తీవ్రంగా శ్రమించామని, ఇప్పుడు ఆ స్థలంలోనే రాజకీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేస్తామని, దీన్ని అందరూ గమనిస్తున్నారని చెప్పారు. గతంలో హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు పూజ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, అనివార్య కారణాలవల్ల విగ్రహం ఏర్పాటు చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఏదేమైనప్పటికీ ఎటువంటి పరిస్థితుల్లో హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని శబదం చేశారు. ఈ సమావేశంలో గ్రామస్తులు దంతం వైకుంఠరావు, ఆటో యూనియన్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్వీయ రక్షణ, ట్రాఫిక్ నియమాలపై అవగాహన

**జలుమూరు, ఏప్రిల్ 20(వార్త):** టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో జోనంకిలోని ఎంపీపీ పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలబాలికలకు స్వీయ రక్షణపై అవగాహన కల్పించారు. ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు పోలీస్ హెల్ప్‌లైన్ నెంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా నేషనల్ హైవే హెల్ప్‌లైన్ 1033, పోలీస్ హెల్ప్‌లైన్ 112, మహిళల కోసం 181, 1091, సైబర్ మోసాలకు 1930, యాంటీ డ్రగ్స్ కోసం 1972, బాలల సహాయానికి 1098 నెంబర్ల ప్రాధాన్యతను వివరించారు. అలాగే రహదారులపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం నేరమని, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. పోక్సో కేసులు, గృహ హింస, వేధింపులపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్, కోటబొమ్మాళి హెడ్ కానిస్టేబుల్ డి. శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుల్ కె. చామంతి, జీఎంఎస్‌కే శాంతి, ప్రధానోపాధ్యాయులు ఎం. వెంకటరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా శక్తి టీం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.




## సీఆర్పీఎఫ్ జవాన్ ఉదయ్‌కుమార్ మృతి

**- ఆర్మీ లాంఛనాలతో అంత్యక్రియలు**



**సారవకోట , ఏప్రిల్ 20(వార్త):** నౌతల గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ ఉదయ్‌కుమార్ అనారోగ్యంతో ఆదివారం విశాఖపట్నం ఆసుపత్రిలో మృతి చెందారు. ఉదయ్‌కుమార్ హైదరాబాద్ బెటాలి యన్ లో జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని ఆర్మీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ వార్తతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. సోమవారం స్వగ్రా మంలో ఆర్మీ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వ హించనున్నారు. గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు ఆయనకు ఘన నివాళులర్పిస్తున్నారు.

## ఉర్లాంలో బడి పిలుస్తుంది ర్యాలీ



**నరసన్నపేట, ఏప్రిల్ 20(వార్త):** ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం 'బడి పిలుస్తుంది'లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు డి.భారతి ఆధ్వర్యంలో గ్రామ వీధులలో విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



**కోటబొమ్మాళి, ఏప్రిల్ 20(వార్త):** జాతీయ అగ్నిమాపక సేవల వారోత్సవం చివరి రోజు సందర్భంగా కోటబొమ్మాళి ఫైర్ స్టేషన్‌లో సోమవారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేజీబీవీ ప్రిన్సిపల్, నలంద స్కూల్ సిబ్బంది, డ్వాక్రా సభ్యులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే అగ్నిమాపక పరికరాల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి వాటి ఉపయోగాలను వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని కోటబొమ్మాళి ఫైర్ స్టేషన్ సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించారు.

## ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

**నరసన్నపేట, ఏప్రిల్ 20(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు అకాడమిక్ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు ప్రిన్సిపల్ మరపట్ల పవన్ తెలిపారు. సోమవారం కళాశాలలో గ్రంథాలయ అధ్యాపకుడు నందగిరి ఆధ్వర్యంలో సైన్స్, ఆర్ట్స్ విభాగాలకు సంబంధించిన పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ నెల 1వ తేదీ నుంచే ఇంటర్ తరగతులు ప్రారంభించామని, విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కూడా కొనసాగుతున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని సూచించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## చలివేంద్రం ప్రారంభం

### - నరసన్నపేటలో ప్రజలకు నీరు, మజ్జిగ పంపిణీ

**నరసన్నపేట, ఏప్రిల్ 20(వార్త):** వేసవిలో పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నరసన్నపేట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో లక్ష్మీ టాకీస్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి గారు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు ప్రజలకు చల్లని మజ్జిగ, స్వచ్ఛమైన తాగునీరు పంపిణీ చేశారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇలాంటి చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సేవా కార్యక్రమాలు చేపట్టడం అవసరమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామపంచాయతీ సభ్యులు, ఎంపీడీవో, ఈవో, అధికారులు పాల్గొన్నారు.



-భారీ ఎత్తున అన్నదానం -ప్రజలకు స్వయంగా భోజనం వడ్డించిన కూన

## ఆమదాలవలసలో అంబరాన్నంటిన ..

# చంద్రబాబు పుట్టినరోజు సంబరాలు





**ఆముదాలవలస, ఏప్రిల్ 20(వార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆమదాలవలస నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమదాలవలసలోని అన్న క్యాంటీన్ లో ప్రత్యేకంగా అన్నదానం నిర్వహించి, పెద్ద ఎత్తున ప్రజలకు ఉచిత భోజనం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ స్వయంగా భోజనం వడ్డిస్తూ సేవాభావాన్ని ప్రదర్శించారు. పేదలు, కార్మికులు, వృద్ధులు, మహిళలకు స్వయంగా ఆహారం అందించి వారి మనసులను గెలుచుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజలతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యత తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమై మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పేదలకు అండగా నిలబడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అన్న క్యాంటీన్లు పేదల ఆకలి తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం ద్వారా నాయకత్వం యొక్క నిజమైన విలువ వెలుగుచూస్తుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో సేవాభావం పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.

ఆముదాలవలసలో ఆనందోత్సాహాల మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పట్టణంలోని అన్నా క్యాంటీన్ వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కేక్ కట్ చేస్తూ సంబరాలు జరిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ కేక్ కట్ చేసి సీఎం గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న నాయకుడిగా చంద్రబాబు నాయుడు నిలుస్తున్నారని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కేక్ కటింగ్ అనంతరం చంద్రన్న జయహో నినాదాలతో సభా ప్రాంతం మార్మోగింది.

## పర్యాటక రంగానికి పెద్దపీట

### -అటవీ అధికారులతో ఎమ్మెల్యే శిరీష సమీక్ష



**పలాస, ఏప్రిల్ 20 (వార్త):** పలాస నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే గౌతు శిరీష నడుం బిగించారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్, అటవీశాఖ ఉన్నతాధికారులతో కలిసి సోమవారం అటవీ ప్రాంతాల్లోని స్థలాలను పరిశీలించారు. పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన అనుమతులు, అటవీ భూముల వినియోగంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ లక్ష్యం కేవలం అభివృద్ధి మాత్రమే కాదని, ప్రకృతిని కాపాడుకుంటూనే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమేనని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా త్వరలోనే మరిన్ని నిధులు మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎమ్మెల్యే, కలెక్టర్, అటవీశాఖ అధికారుల మధ్య సమన్వయంతో పర్యటన చేశారు.నగరవనం పూర్తి స్థాయిలో పనులు చేపట్టి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తిసుకువస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి మురళి కృష్ణమ నాయుడు, స్థానిక అధికారులు, పలాస టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెత్త నుంచి సంపద కేంద్రం తనిఖీ

### - పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి - ఎంపీడీవో సూచనలు



**సారవకోట, ఏప్రిల్ 20(వార్త):** సారవకోట మండలం పరిధిలోని వెంకటాపురం చెత్త సంపద కేంద్రాన్ని ఎంపీడీవో మోహన్ కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహణ విధానం, రికార్డులను పరిశీలించారు. ప్రతి రోజు ఇంటింటికీ చెత్త సేకరణ తప్పనిసరిగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. సేకరించిన చెత్తను సక్రమంగా వినియోగించి వర్మీ కంపోస్టు తయారీ చేపట్టాలని తెలిపారు. అలాగే ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణపై ర్యాలీ



**జలుమూరు, ఏప్రిల్ 20 (వార్త):** చల్లవానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బమ్మిడి మాధవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవడం ప్రతి గ్రామస్థుడి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులతో కలిసి గ్రామ వీధుల్లో నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

### -ముసిడిగట్టు గ్రామస్థులతో స్పెషలాఫీసర్ సమావేశం

**నరసన్నపేట, ఏప్రిల్ 20(వార్త):** పంచాయతీలలో పారిశుధ్యం పట్ల ప్రత్యేకంగా దృష్టి సారించాలని స్పెషల్ ఆఫీసర్ శరత్ తెలిపారు. సోమవారం నరసన్నపేట మండలం ముసిడిగట్టులో మాజీ సర్పంచ్ సూరన్న నాయుడు ఆధ్వర్యంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ తాను ప్రస్తుతం నరసన్నపేట ఎన్నికల డిప్యూటీ తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్నానని, స్పెషల్ ఆఫీసర్ బాధ్యతలు కూడా చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గ్రామస్థులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.



## జ్ఞానభారతిలో జల పక్షోత్సవాలు




**ఇచ్ఛాపురం ఏప్రిల్ 20(వార్త):** జ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కేంద్ర ప్రభుత్వ సూచనలతో, రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలతో జల పక్షోత్సవాలలో భాగంగా సోమవారం జలం జీవం పై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా నీటి ప్రాధాన్యతపై, నీటిని సంరక్షించుకునే విధానంపై, తీసుకోవలసిన చర్యలపై ప్రత్యేక వ్యాసరచన పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. సుమారు 200 విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. అనంతరం పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వాహణాధికారి జోహార్ ఖాన్ విద్యార్థులతో జల సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో, ట్రస్టీ రమణ మూర్తి,ప్రిన్సిపాల్ ఐబి పండ, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 20(వార్త):** రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణలో బారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పత్రి తవిటయ్య,రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ కొండా శంకర రెడ్డి,కాళ్ల దర్మారావు, జయదేవ్,లీలా రాణి, రెయ్యిజానకిరావు, డి డిల్లీరావు, డి కామేష్, కాళ్ళ దిలీప్ ,జన్నెల సంతోష్ ,సుభాష్ రౌలో,గిరిష్ ,మాధవరావు, చంద్రశేఖర్ ,కురస్వామి, గణపతి, విసు,పితంబర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల పంపిణీ

**నరసన్నపేట, ఏప్రిల్ 20(వార్త):** నరసన్నపేట పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం ఇంటర్న్షిప్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ ఆర్. విజయకుమారి పాల్గొని సర్టిఫికెట్లు అందజేశారు. ఎలక్ట్రానిక్స్, హెల్త్ కేర్, రిటైల్ వృత్తి కోర్సుల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఈ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తి విద్య విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని, అందువల్ల విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల హెడ్‌మాస్టర్ పైడి వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం

### -చంద్రబాబు జన్మదినం సందర్భంగా అందించిన రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకట్రావు

### -అభినందించిన ఎమ్మెల్యే రమణమూర్తి




**నరసన్నపేట, ఏప్రిల్ 20(వార్త):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా నరసన్నపేటకు చెందిన జామి వెంకట్రావు లక్ష రూపాయలు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జన్మదినాన్ని సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. జామి వెంకట్రావు గారు అందజేసిన ఈ ఆర్థిక సహాయం పేదల సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. సమాజంలో సేవాభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, "సూపర్ సిక్స్" వంటి పథకాల ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతోందని అన్నారు. పేదలు, అవసరమైన వారికి సహాయం అందించడంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### కలెక్టర్, ఎస్పీలకు గ్యాస్ డీలర్ల వినతి

**కవిటి, ఏప్రిల్ 20(వార్త):** జిల్లాలో భారత్ గ్యాస్ డీలర్లు, సిబ్బందిపై జరుగుతున్న వరుస భౌతిక దాడులను అరికట్టి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ గ్యాస్ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. అంతర్జాతీయ పరిస్థితుల వల్ల గ్యాస్ సరఫరాలో జాప్యం జరుగుతోందని, నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల బుకింగ్ వ్యవధిని పాటించాల్సి ఉన్నా, అవగాహన లేని కొందరు వ్యక్తులు కవిటి వంటి చోట్ల ఏజెన్సీ నిర్వాహకులపై దాడులకు దిగుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద శాతం ఓటీపీ విధానం ద్వారానే పారదర్శక పంపిణీ చేపడుతున్నామని, బుకింగ్ లేకపోయినా సిలిండర్లు ఇవ్వాలని ఒత్తిడి చేస్తూ బెదిరింపులకు పాల్పడటం వల్ల డెలివరీ సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారని వివరించారు. ఇప్పటికే కవిటిలో నమోదైన కేసులో నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు రక్షణ కల్పించాలని వారు కోరగా, శాంతిభద్రతల పరిరక్షణకు తక్షణ ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్, ఎస్పీ హామీ ఇచ్చారు.



## అన్నా క్యాంటీన్ చైర్మన్‌గా లీలారాణి



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 20 (వార్త):** అన్నా క్యాంటిన్ సలహా కమిటీ నూతన చైర్మన్ గా తెలుగుదేశం పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు, జిల్లా పార్లమెంటరీ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆశి లీలారాణిని నియమించారు. సభ్యులు గా శానిటేషన్ సెక్రటరీ రాజేష్, మహిళా పోలీస్ సూర్యకుమారి, అలయన్స్ క్లబ్ ప్రతినిధి ఉమా శంకర రావు, డ్వాక్రా మహిళ సుధా రాణి, కన్వీనర్ గా మున్సిపల్ మేనేజర్ యాదం అప్పల స్వామి లను నియమించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి అందజేసిన ఒక్క రోజు విరాళం తోరాష్ట్ర ప్రభుత్వం గా అన్ని అన్నాక్యాంటిన్లలో ఫ్రీ టోకిన్ లతో ఉచితంగా భోజనాలు అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ కొండా శంకర రేడ్డి, పట్టణ అధ్యక్షులు పత్రి తవిటయ్య, కాళ్ల దర్మారావు, కాళ్ల జయదేవ్, ఆర్ జాని, ఎన్ జాని, సంతోష్ , శేఖర్ గణపతి, వెంకట్ రెడ్డి, రామారావు, లోహిదాస్ నారాయణ బెహేరా కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేతో కాశీబుగ్గ డీఎస్పీ భేటీ

**పలాస, ఏప్రిల్ 20 (వార్త):** పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కాశీబుగ్గ నూతన డిఎస్పీగా పదవి బాధ్యతలు చేపట్టిన భవాని మర్యాదపూర్వకంగా సోమవారం పలాస టిడిపి పార్టీ కార్యాలయంలో కలిశారు.

ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ శాంతిభద్రతలకు తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో ఇటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పని చేస్తానని భరోసా ఇచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని, ధైర్యంగా ముందుకు వెళ్లాలని చెప్పారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కొత్త దిబ్బలపాలెంలో పల్లెనిద్ర

**ఎచ్చెర్ల, ఏప్రిల్ 20 (వార్త):** ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు సబ్ ఇన్స్పెక్టర్ జి. హరికృష్ణరావు, సిబ్బంది తో కలిసి ఎచ్చెర్ల మండలం కొత్త దిబ్బలపాలెం గ్రామంలో కమ్యూనిటీ అవుట్‌రీచ్ పల్లె నిద్ర కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక మత్స్యకారులతో రాత్రి బస చేశారు. వేట నిషేధం సమయములో సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, అనుమానిత వ్యక్తులు గూర్చి తీవ్రవాదులు, దేశ వ్యతిరేక శక్తుల ప్రమాదాల గురించి, బాలికల అక్రమ రవాణా, పోక్సో కేసుల గురించి వారికి అవగాహన కల్పించారు. విశ్వాసం, స్నేహం, జాతీయ సమగ్రతను పెంపొందించారు. అసమానతలు గుర్తు తెలియని వ్యక్తులు తారసపడినా, నిషేధిత మాదక ద్రవ్యాలు తీరం వెంబడి రవాణా చేసినా కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్ 1093 కళింగపట్నం ఎస్.హెచ్.ఓ.-9392914712 సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.





## కేంద్రీయ విద్యాలయంతో.. పలాసకు
# జాతీయ స్థాయిలో గుర్తింపు

*** కేంద్ర పౌర విమాన శాఖామంత్రి రామ్మోహన్ నాయుడు * కేవీని ప్రారంభించిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**పలాస, ఏప్రిల్ 20(వార్త):** ఉద్దానం ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కేంద్ర విద్యాలయం ఉపయోగపడుతుందని, ప్రజలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు చిరకాల వంచ నెరవేరిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస రైల్వే కాలనీ ఆర్పిఎఫ్ బ్యారక్‌లో కేంద్రీయ విద్యాలయం తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ పలాస అంటే వలసలు, కిడ్నీ వ్యాధులకు నిలయం అనే గుర్తింపు ఉందని నేడు ఒక కేంద్రీయ విద్యాలయం కూడా ఉందని గర్వంగా చెప్పుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో నాలుగు కేంద్రీయ విద్యాలయాలు ఈ ఏడాది మంజూరు కాగా ఇందులో వలాస ఒకటిగా మంజూరు కావడానికి జిల్లా ఎంపి, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కృషి ఎంతగానో ఉందని చెప్పారు. ఇక్కడ కేంద్రీయ విద్యాలయం రావడం పలాసకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. సూదికొండ వద్ద పది ఎకరాల స్థలంలో శాశ్వత భవనాలు నిర్మిస్తామన్నారు. తాను జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో కేంద్రీయ విద్యాలయం పలాసలో ప్రారంభం కావడం ఎంతో సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్ అన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్ మాట్లాడుతూ సుమారు 350 మంది పిల్లలు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఈ కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులు శ్రద్ధగా, క్రమశిక్షణతో చదువు కొని భవిష్యత్లో ఉన్నత స్థాయిలో నిలిచి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్, రైల్వే ఉన్నతాధికారులు, ఆర్టీఓ పి.అప్పలరాజు, తాహిసిల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, ఎపిడిఓ కె.వసంతకుమార్, ఎపిటిపిసి చైర్మన్ వజ్జి బాబూరావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పి.విఠల్, లొడగల కామేశ్వరరావు, చిన్ని, దిద్ద నాగరాజు, సప నవీన్, జనసేన కస్టర్ ఇన్ చార్జీ. దువ్వాడ వంశీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకోవాలి

*** వివిధ అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులు పారదర్శకంగా క్లియర్ చేస్తా * మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హెచ్. కూర్మారావు**



**శ్రీకాకుళం, ఏప్రిల్ 20(వార్త):**నగర ప్రజలు సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హెచ్. కూర్మారావు వెల్లడించారు. వివిధ అనుమతుల కోసం వచ్చే దర ఖాస్తులను పారదర్శకంగా క్లియర్ చేస్తామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాల యంలో సోమవారం విలేఖరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయ-గణన ఈనెల 16 నుండి 30 వరకు జరుగుతోందన్నారు. ప్రతీ ఇంటి నుండి జనగణన ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరూ వెబ్ సైట్ https://se.census.gov.in/ లోకి వెళ్లి వారి జన గణన నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. భారత జనాభా లెక్కల సేకరణలో భాగంగా, కేంద్ర ప్రభుత్వం ఈసారి ప్రజలు తమ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకోవాలని నగర ప్రజలకు పిలుపునిచ్చారు. ఏప్రిల్ 30 వరకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకోవచ్చన్నారు. మే నెలలో ఎన్యూమరేషన్ సిబ్బంది ఇంటింటికి వచ్చినపుడు ఎస్ఈ ఐడిని చూపించాలన్నారు. ఎన్యూమరేషన్ సిబ్బంది ఐడి నమోదు చేసినపుడు డేటా సరిపోయింది లేనిది చూసి గణన సరిపోతే గణన పూర్తయినట్టేనన్నారు. నగరంలోని వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికి వస్తారని చెప్పారు. అందరి సహాయ సహకారాలు అందించి జనగణనను విజయవంతం చేయాలని కోరారు. స్వచ్ సర్వేక్షణ్ ఎక్కడైతే జరుగుతుందో వాటిని పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొ న్నారు. స్వచ్ సర్వేక్షణలో జిల్లాకు గుర్తింపు వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. చెత్త సేకరణకు స్వచ్ సర్వేక్షణ నుండి వచ్చిన 42 వాహనాలు ద్వారా చెత్తను సేకరిస్తున్నట్లు చెప్పారు. తడి పొడి చెత్త లను వేరుచేస్తున్నామన్నారు. మిర్తి బట్టిలో పేరుకుపోయిన పూడికను తీస్తామన్నారు. మిర్తి బట్టికి ఇరువైపులా శుభ్రం చేస్తామన్నారు. గ్రీవెన్స్ సోమవారమే కాకుండా మిగిలిన రోజుల్లోనూ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. నగర ప్రజలకు ఎల్లవేళలా సేవలందిస్తామన్నారు. ఎల్ఆర్ఎస్, తదితర అనుమతులు అన్నింటిని క్లియర్ చేస్తామన్నారు. ఏదైనా సమస్య పై ఫిర్యాదు వస్తే సమస్యను పారదర్శకంగా, వ్యక్తిగతంగా పరిశీలన చేసి ఫిర్యాదు దారునికి న్యాయం చేస్తామన్నారు. పారిశుధ్య కార్మికులకు బకాయిలు లేకుండా వేతనాలు అందిస్తామన్నారు. 50 వార్డుల్లో మహిళా సంఘాలు ఉన్నట్లు చెప్పారు. అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేస్తామ న్నారు. అరసవల్లిలో బిపిఎస్ కాలువలపై స్లాబ్ పనులు జరుగుతున్నట్లు చెబుతూ ప్రజలు విశాలంగా నడుచుకోవచ్చన్నారు. అవసరమైన చోట ట్యాంకర్లుతో తాగునీరు సరఫరా చేస్తామన్నారు.

## రెండు రోజుల్లో ఉపాధి బకాయిల జమ

**శ్రీకాకుళం, ఏప్రిల్ 20(వార్త):**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను రెండు రోజుల్లో వేతనదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వి. లవరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న వేతనదారులకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వం నుండి స్పష్టత వచ్చిందని, నిధులు కూడా విడుదలయ్యాయని ఆయన పేర్కొన్నారు. సాంకేతిక కారణాల వల్ల గత కొన్ని రోజులుగా ఆగిన పేమెంట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకే జమ చేస్తామని వివరించారు.

## 22న జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

**శ్రీకాకుళం, ఏప్రిల్ 20(వార్త):**జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీన నిర్వహించ నున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్. వెంకటరామన్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశం ప్రారంభమవుతుందని, జడ్పీ చైర్మన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నారని చెప్పారు.

# ఘనంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు



**పలాస, ఏప్రిల్ 20(వార్త):** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 76వ జన్మదిన వేడుకలు సోమవారం పలాస టీడీపీ కార్యాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి అలుపెరగని శ్రామికుడిగా, విజనరీ లీడర్‌గా ప్రజల్లో అభిమానాన్ని పొందారని తెలిపారు. చంద్రబాబు నాయుడు పేద ప్రజల అభ్యున్నతికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి, ప్రజల హృదయాలలో స్థిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలకాలం ఆయురారోగ్యాలతో ఉండాలని వెంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పలాస నియోజకవర్గం టీడీపీ నాయకులు లొడగల కామేష్, జి సూర్యనారాయణ, సప్ప నవీన్, డొక్కరి శంకర్రావు, కార్యకర్తలు, టీడీపీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పలాస జిల్లా సాధన ఉద్యమానికి సంపూర్ణ మద్దతు

**-ఉద్దానం వెనుకబాటుతనం పాలకులకు కనిపించడం లేదా?**

**- సాగు,తాగునీరు లేకుండా ప్రజల జీవన ప్రమాణాలు ఎలా మెరుగుపడతాయి?**

**-పలాస జిల్లాతోనే ఉద్దానం పారిశ్రామికాభివృద్ధి**

**బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాలిన నరసింహ యాదవ్**



**పలాస, ఏప్రిల్ 20 (వార్త):** భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల్లో భాగంగా మనిషికి జీవించే హక్కు ఉన్నప్పటికీ, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడంలో పాలకవర్గాల వైఫల్యాలు వల్లే ప్రాంతీయ అసమానతలు ఏర్పడతాయని, ఇతర ప్రాంతాలతో పాటు సమానంగా ఉద్యోగ, ఉపాధి, విద్య, ఆరోగ్య, వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి పొందేందుకు పోరాట ఉద్యమాలే శరణ్యం అవుతాయని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సాలిన నరసింహ యాదవ్ అన్నారు. సోమవారం పలాసలో ప్రముఖ సామాజికవేత్త, పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్(బాబా)ను మర్యాదపూర్వకంగా ఆయన కలిసి, జిల్లా సాధన ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సాలిన నరసింహ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన నియోజకవర్గాలలో ఇచ్ఛాపురం నియోజకవర్గం ఉందని, అదే మాదిరిగా ఉద్దాన ప్రాంతమైన పలాసలో కూడా కొన్ని ప్రాంతాలు వెనుకబాటు తనతోపాటు జరుగుబాటు తను లేక , వలసల అడ్డాగా ముద్రపడ్డాయన్నారు. వంశధార, నాగావళి నదుల జలాలు కొన్ని ప్రాంతాలకే పరిమితం కాబడ్డాయని, పలాస నియోజకవర్గంలో పాటు ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సాగు, తాగునీరు లేకపోవడం వల్ల, అన్ని రంగాల్లో ఇక్కడ వెనుకబాటు తనం ఉందన్నారు. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ, శ్రీకాకుళం జిల్లా పునర్విభజన జరగలేదని, కూటమి ప్రభుత్వంలో పలాస జిల్లా ఏర్పాటు చేస్తామని, మాట ఇచ్చి తప్పిన పాలకుల తీరు.. ఉద్దానం ప్రాంత ప్రజల మనోభావాలు దెబ్బతీసినట్లు అయిందన్నారు. సాగు, తాగునీరు లేకుండా నాగరికత తో పాటు ప్రజల జీవన ప్రమాణాలు ఎలా మెరుగుపడతాయని నరసింహ యాదవ్ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల కంటే పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా ఈ ప్రాంతం ఎంతో వెనకబడి ఉందని, అందుకు సాగు, త్రాగునీటి సౌకర్యాలు కల్పించాలంటే, వంశధార, మహేంద్ర తనయ నదీ జలాలు ఇచ్ఛాపురం నియోజకవర్గ శివారు ప్రాంతాల వరకు సద్వినియోగం జరగాలని, అందుకు పలాస జిల్లా సాధన తోనే ఈ ప్రాంత అభివృద్ధి ముడిపడి ఉందని ఆయన స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి నేటి వరకు ఎటువంటి అభివృద్ధి ఫలాలకు నోచుకోని ప్రాంతంగా నిర్లక్ష్యం చేయబడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పలాస జిల్లా ఏర్పడితే పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి అనేక అవకాశాలు ఉన్నాయని, పలాస కు సమీపంలోనే మూలపేట పోర్టు ఉందని, తద్వారా మరింత పారిశ్రామిక అభివృద్ధి జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, వజ్రపు కొత్తూరు తదితర మండలాల నుంచి శ్రీకాకుళం కేంద్రానికి వెళ్లాలంటే ఎంతో ప్రయాసలుపడవలసి వస్తుందని, పరిపాలన సౌలభ్యం కోసం పలాస జిల్లా ఏర్పాటు అనివార్యమని, అందుకు జిల్లాకు చెందిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు లతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గం సమస్యలను గుర్తించి, తక్షణం పలాస జిల్లాగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. రోజురోజుకు పలాస జిల్లా ఏర్పాటు చేయాలంటూ అన్ని వర్గాల ప్రజలనుంచి మద్దతు లభిస్తుందని, ప్రజా బీష్టం మేరకు తక్షణం పలాస కేంద్రంగా జిల్లా ప్రకటించాలని, అందుకు ప్రజల ఆకాంక్షలమేర గొంతు వినిపిస్తున్న దువ్వాడ శ్రీధర్( బాబా) కొనసాగిస్తున్న ప్రజా ఉద్యమానికి తమతోపాటు క్షేత్రస్థాయిలో అన్ని వర్గాల ప్రజలనుంచి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని సాలిన నరసింహ యాదవ్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఉద్దానం ప్రాంత ప్రజల ఆకాంక్షలను పరిగణలోకి తీసుకొని పలాస జిల్లాను తక్షణ ప్రకటించాలని, లేకపోతే ఈ ఉద్యమాన్ని శాంతియుతంగా మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ఇంపాక్ట్ క్లబ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా చిరంజీవి



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 20(వార్త):** ఇంటర్నేషనల్ మాస్టర్ మోటివేషనల్ స్పీకర్, కోచ్ గంప నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ - ఐ సి ఐ - ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ నూతన కార్యవర్గంలో జాతీయ ఉపాధ్యక్షునిగా 2026-27 సంవత్సరానికి పల్లంటి చిరంజీవి ని ఎన్నుకోవడం జరిగింది. విశాఖపట్నం ఉక్కు నగరంలోని స్టీల్ క్లబ్ లో నిర్వహించిన జాతీయ వార్షిక లీడర్షిప్ మీట్, అవార్డు నైట్ కార్యక్రమంలో ఈ మేరకు నియామక పత్రాలను ఇంటర్నేషనల్ మోటివేషనల్ స్పీకర్ ,కోచ్, జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్ వెంకటేశ్వరరావు, కే మాధవి, మాజీ జాతీయ అధ్యక్షులు సోను శ్రీనివాసరావు తదితరుల చేతుల మీదుగా అందించారు. అభినందనలు తెలియజేశారు. 2025-26 సంవత్సరానికి ఉత్తరాంధ్రకు రీజనల్ ప్రెసిడెంట్ గా వ్యవహరిస్తూ లీడర్షిప్, ట్రైనింగ్, సర్వీస్ తదితర రంగాలలో అందించిన సేవలకు గుర్తింపుగా అవుట్స్టాండింగ్ రీజినల్ ప్రెసిడెంట్ గా ఎన్నుకుని ప్రత్యేక అవార్డును అందించారు. ముఖ్యంగా విద్యార్థులకు, యువతకు అందించిన మోటివేషన్ క్లాసెస్, విద్యా సంబంధిత శిక్షణలు, ఉత్తమ సామాజిక సేవా కార్య పర్యావరణకార్యక్రమాలు నిర్వహించినందుకు ప్రత్యేకంగా ప్రశంసించారు. జాతీయ ఉపాధ్యక్షునిగా కృష్ణాజిల్లా, ఎన్టీఆర్ జిల్లా , మచిలీపట్నం జిల్లా, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లా, ఒడిస్సా ప్రాంత పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. అదేవిధంగా ఇచ్ఛాపురం ఐ సీ ఐ క్లబ్ కు రీజియన్ 4 లో ఉత్తమ క్లబ్ అవార్డు లభించింది.

## పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**పలాస, ఏప్రిల్ 20 (వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పట్టణ రహదారిపై ప్రయాణిస్తున్న బాటసారుల దాహార్తిని తీర్చేందుకు పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ "మానవ సేవే మహోన్నత సేవ" అని పేర్కొంటూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. తీవ్ర ఎండల నేపథ్యంలో ఏప్రిల్ నెలలో ఒక వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమం వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది. మజ్జిగ పంపిణీకి ఆర్థిక సహాయం అందించిన ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ పి. వెంకటరమణని ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్. శ్రీనివాస్ పట్నాయక్, బి. నరసింహులు, డాక్టర్ పి. మధు, డాక్టర్ వై. వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





## ఆహార పదార్థాల తనిఖీ

**అరసవల్లి, ఏప్రిల్20(వార్త):** ఆహార పదార్థాల్లో హానికారక రంగులు ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి లేని ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ సిహెచ్ లక్ష్మీనారాయణ తెలియజేశారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం అరసవెల్లి అసిరి తల్లి ఉత్సవాలలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్ లో తనిఖీలు నిర్వహించారు. అసిరితల్లి అమ్మవారి ఉత్సవం సందర్భంగా, ప్రదర్శనశాల ప్రాంతంలో దాని పరిసరాల్లో 11 ఆహార భద్రతా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఆహార భద్రతాధికారి కె.లక్ష్మీ పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

**కంచిలి, ఏప్రిల్ 20 (వార్త):** ఒడిశా నుంచి ఇతర ప్రాంతాలకు గంజాయిను రవాణా చేస్తున్న వ్యక్తిని కంచిలి రైల్వే స్టేషన్ పరిసరాల్లో సోమవారం అరెస్ట్ చేసినట్లు సోంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ బి మంగరాజు తెలిపారు. ఇందుకు సంబంధించి సోమవారం సాయంత్రం కంచిలి పోలీస్ స్టేషన్లో విలేకరులకు ఎస్సై పారినాయుడు తో కలిసి వివరాలను వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రం గజపతి జిల్లా తబరాడ పంచాయతీ గోలి గ్రామానికి చెందిన రాగుల్ అనే వ్యక్తి 6.69 కిలోల గంజాయిని బ్రౌన్ కలర్ ప్లాస్టర్‌లో చుట్టి హౌరా చెన్నై మెయిల్ ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా కంచిలి పోలీసులకు అనుమానంతో పరిశీలించారు. అతని వద్ద గంజాయి లభించినట్లు తెలిపారు. నిందితుని వద్ద నుంచి గంజాయితోపాటు రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా ఇదే చిరునామాలో నివసిస్తున్న అవినాష్ అనే వ్యక్తి నుంచి తాను సేవించడానికి అలాగే అధిక ధరలకు విక్రయించడానికి గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిసింది. దీంతో అవినాష్ ను ఏ 2గా కేసులో నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మంగరాజు మాట్లాడుతూ పిల్లల వ్యవహారాలను తల్లిదండ్రులు తప్పకుండా పరిశీలిస్తుండాలని సూచించారు. తప్పుడు నడవడిక పిల్లల భవిష్యత్తుకు పెద్ద ప్రమాదకరంగా మారుతుందని అన్నారు.

## పద్మ పురస్కారాలకు నామినేషన్ల ఆహ్వానం

*** జూలై 31 వరకు ఆన్‌లైన్‌లో గడువు**
*** జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, ఏప్రిల్ 20 (వార్త):** జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతులు, నిస్వార్థ సేవకుల నుంచి 2027 సంవత్సరపు 'పద్మ' పురస్కారాలకు ప్రతిపాదనలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, వ్యాపార పారిశ్రామిక, ప్రజా వ్యవహారాలు విభాగాల్లో విశిష్టమైన గుర్తింపు పొందిన వారిని పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డుల కోసం ప్రతిపాదించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా గుర్తింపునకు నోచుకోని క్షేత్రస్థాయి వ్యక్తులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ మరియు వెనుకబడిన వర్గాల నుంచి అర్హులను గుర్తించడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. తమకు తాముగా స్వీయ నామినేషన్లు ఆన్‌లైన్ ద్వారా https://awards.gov.in పోర్టల్‌లో సమర్పించవచ్చని, ఆన్లైన్ దరఖాస్తులకు జూలై 31, 2026 చివరి తేదీ అని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని అర్హులైన వ్యక్తుల వివరాలను నిర్ణీత నమూనాలో జూన్ 10వ తేదీలోగా తదుపరి చర్య కొరకు కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. జిల్లా నుంచి ఉత్తమ ప్రతిపాదనలను పంపి, జిల్లా గౌరవాన్ని జాతీయ స్థాయిలో చాటాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హులైన వారు నామినేషన్ సమర్పించేటప్పుడు సదరు వ్యక్తి సాధించిన విజయాలను, చేసిన విశిష్ట సేవలను స్పష్టంగా వివరించేలా ఒక వివరణాత్మక పత్రాన్ని జత చేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం www.padmaawards.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

*** ఎంఈవోలు సుజాత, కృష్ణారావు**
*** గూడెంలో 'బడి పిలుస్తోంది'**

**శ్రీకాకుళం, ఏప్రిల్ 20 (వార్త):**గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వై.హరిబాబు అధ్యక్షతన బడి పిలుస్తుంది కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ చేశారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలంటూ గ్రామస్థులకు అవగాహన కల్పించారు. శ్రీకాకుళం రూరల్ మండలం విద్యాశాఖ అధికారులు సుజాత. కృష్ణారావు పాల్గొని మాట్లాడారు. మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ప్రభుత్వమే పూర్తిగా అన్ని రకాలైన సౌకర్యాలను కల్పిస్తూ పిల్లలకి పూర్తిగా ఉచితంగా విద్యను అందిస్తుందన్నారు. తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్‌ను ఉచితంగా విద్యార్థులకి అందిస్తుందన్నారు. క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారన్నారు. విద్యార్థులు సైతం పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులు ఆలోచించి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు పంపించి డబ్బులు వృథా చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దుందు శర్వాణి, సర్పంచ్ ప్రతినిధి అప్పలరాజు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎర్రయ్య, పాఠశాల ఇన్చార్జి ఉపాధ్యాయులు గుంట లక్ష్మణరావు, ధర్మారావు, వెంకట్రావు, కృష్ణారావు, శ్రీనివాసరావు, చంద్రమ్మ, నీలవేణి, హేమలత, ధనలక్ష్మి, లీలావతి, జగన్నాధ రావు, సౌజన్య, మధుబాబు, అప్పలరాజు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.









* పాతపట్నంలో ఎమ్మెల్యే ఎంజీఆర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు * వేలాది మంది కార్యకర్తలు, నాయకులు, అభిమానుల సందడి * 150 యూనిట్లు రక్తదానం చేసిన కార్యకర్తలు, అభిమానులు * 500 మందికి వైద్య పరీక్షలు * నీలమణి దుర్గ అమ్మవారి ఆలయానికి భారీ ర్యాలీ * చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలంటూ 1016 కొబ్బరికాయలు కొట్టిన ఎంజీఆర్ * ఆలయ ఆవరణలో 76 మొక్కలు నాటిన ఎమ్మెల్యే, నేతలు * నిరుపేదలకు దుస్తులు పంపిణీ * ఆసుపత్రిలో రోగులకు పండ్లు అందజేత * అన్నా క్యాంటీన్‌లో అన్నదానం



# హ్యాపీ బర్త్ డే.. సీఎం సార్



**పాతపట్నం, ఏప్రిల్ 20 (వార్త):** ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రగతి రథసారథి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలను పాతపట్నం నియోజకవర్గంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు, అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జన్మ దిన వేడుకల్లో ఐదు మండలాలకు చెందిన ప్రజలు, కార్యకర్తలు, అభి మానులు తరలివచ్చారు. వారి నడుమ కేక్‌ను కట్ చేసి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరంలో సుమారు 150 మంది అభిమానులు రక్తదానం చేశారు. అలాగే ఉచిత మెగా వైద్య శిబిరంలో 500 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం వందలాది వాహనాలతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి నీలమణి దుర్గ అమ్మవారి ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి గారు మీదన ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే.. 1016 కొబ్బరికాయలు కొట్టారు. ఆలయ ఆవరణలో 76 మొక్కలు నాటారు. యాచకులకు, వృద్ధులకు వస్త్ర దానం చేసిన తరువాత స్థానిక సిహెచ్సి లో రోగులకు పండ్లను, రొట్టెలను పంపిణీ చేశారు. అన్నా క్యాంటీన్‌లో సుమారు 1000 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నారు. ఆయన హయాంలోనే రాష్ట్రం ప్రగతి పథాన ముందుకుసాగుతుందని, ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. ఈ జన్మదినం వేడుకల్లో పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.










Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546